

హోరాహోరీగా ఎస్‌పీఎల్

నిజామాబాద్‌లో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. టోర్నీలో జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి.

- 8లో ▸



ప్రయోగాలు చేసేదెలా?

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సంబంధించిన మెటీరియల్ కొనుగోలుకు నిధులు మంజూరు కావడం లేదు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /12.5

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రివేళ చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు ఆర్మూర్‌కు ఈటల రాజేందర్ రాక

సుభాష్‌నగర్: ఆర్మూర్‌లోని మామిడిపల్లి చౌరస్తాలో గల విజయలక్ష్మి గార్డెన్‌లో సోమవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నారు. సమావేశానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సమావేశానికి జిల్లా పదాధికారులు, నియోజకవర్గ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల ఇన్‌చార్జీలు, అసెంబ్లీ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా, రాష్ట్ర సెల్స్ కన్వీనర్లు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరుకావాలని పార్టీ జిల్లా కార్యాలయ సహ కార్యదర్శి జస్వంత్‌రావు కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలి



మాక్లూర్: పెట్టుబడి తక్కువ, రాబడి ఎక్కువగా ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు సూచించారు. ఆదివారం సింగంపల్లి తండాలో ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతు గంగాధర్ వ్యవసాయ క్షేత్రానికి వచ్చి ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి లాభాలను ఇచ్చే ఆయిల్‌పామ్ సాగును రైతులు ఎంచుకోవాలన్నారు. నామమాత్రపు పెట్టుబడితో 30 ఏళ్ల పాటు లాభాలు ఆర్జించవచ్చాన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి నర్సింగ్‌దాస్, ఎంపీడీవో క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ టోకెన్లు..

మోర్తాడ్: ఎవరు ఏ రోజు కంటి వెలుగు శిబిరానికి హాజరు కావాలో తేదీని నిర్ణయిస్తూ ముందస్తు సమాచారంతో కూడిన టోకెన్లను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. జిల్లాలో కార్యక్రమం కొనసాగుతోంది. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో నెల రోజుల వరకు కంటి వెలుగు శిబిరం కొనసాగే అవకాశం ఉంది. దీంతో శిబిరాల్లో ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పరీక్షలను చేయడం కోసం వైద్యారోగ్య శాఖ కసరత్తు చేస్తోంది. ఒకేరోజు రద్దీ ఎక్కువగా ఉండకుండా నిర్ణీత మొత్తంలో పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. మండల కేంద్రాల్లోని శిబిరాలకు రోజుకు 200ల మంది, గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 130 మందికి తగ్గకుండా పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏ ఇంటి వారు ఏ రోజు శిబిరానికి రావాలో సూచిస్తూ ఆశ వర్కర్లు టోకెన్లను పంపిణీ చేస్తున్నారు. కంటి వెలుగు సమాచారంతో కూడిన కరపత్రంలో కేటాయించిన తేదీని రాసి ఇస్తున్నారు. శిబిరం నిర్వహిస్తున్న ప్రాంతం సమాచారం కూడా రాస్తున్నారు. నెల రోజుల కంటే ముందుగానే పంపిణీ చేస్తున్నారు.

నవ్వి'పోదురు గాక..

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో పలువురు టీచర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. పదోన్నతుల కోసం లేని వైకల్యాన్ని చూపుతూ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించారు. గుండె జబ్బు ఉన్నట్లు చూపారు. కొందరు యూనియన్ నేతలు విద్యాశాఖ కార్యాలయంలో తిష్ట వేసి చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని డీఈవోను కోరిన నేతలే ఈ అక్రమ వ్యవహారాన్ని ముందుండి నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

- టీచర్ల బదిలీలు, ప్రమోషన్లలో అడ్డదారులు
- వైకల్యం లేకున్నా.. నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌ల సమర్పణ
- చక్రం తిప్పుతున్న యూనియన్ నేతలు
- డీఈవో కార్యాలయంలోనే తిష్ట..
- ఖాళీల జాబితా ప్రదర్శించని విద్యాశాఖ తీరుపై విమర్శలు



కామారెడ్డి విద్యాశాఖ కార్యాలయం



హెచ్‌ఎం పదోన్నతుల సీనియారిటీ జాబితా



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అభాసుపాలు అవుతోంది. నిబంధనల ప్రకారం ఖాళీలు, సీనియారిటీ జాబితా ప్రకటించిన తర్వాతే బదిలీలు చేయాలి. ఈనెల 27నే ఖాళీలు, సీనియారిటీ జాబితా ప్రకటించాల్సి ఉన్నా.. ఇప్పటికీ ప్రదర్శించలేదు. మరోవైపు ఖాళీల జాబితా ప్రదర్శించకుండానే బదిలీలు చేపట్టడం, వారు రిలీవ్ అయి కొత్త స్థానంలో చేరారు. ఇప్పటికే ఇద్దరు పరపతితో బదిలీలు చేయించుకున్నారు. మరికొందరు కూడా పరపతి బదిలీలు చేయించుకున్నారని తెలుస్తోంది. దీనిపై స్పందించకపోవడంతో డీఈవోపైనా విమర్శలు వస్తున్నాయి.

హెచ్‌ఎం ప్రమోషన్‌లకు సంబంధించి..

పీజీ హెచ్‌ఎం పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాను శనివారం రాత్రి డీఈవో కార్యాలయం వద్ద ప్రదర్శించారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాతోపాటు 860 ఖాళీల వివరాలు ప్రకటించాల్సి ఉంది. సోమవారం ఈ జాబితాలు ప్రదర్శించే అవకాశాలున్నాయి.

అక్రమాలు..

బదిలీలు, పదోన్నతులకోసం అర్హత గల ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్‌లు సమర్పించాల్సి ఉంటుంది. వైకల్యంతోపాటు క్యాన్సర్, గుండె శస్త్ర చికిత్స, ఎముకల క్షయ, కాలేయం, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, ల్యుకేమియా తదితర వ్యాధులతో బాధపడే వారికి సదరం లేదా మెడికల్ బోర్డు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా ప్రమోషన్లు, బదిలీలలో ప్రాధాన్యత ఇస్తారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం, ఎస్జీటీలు, హెచ్‌ఎం పదోన్నతుల కోసం ఎస్‌ఏలు సర్టిఫికెట్లను సమర్పించారు. బదిలీల కోసం 28 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంది. కాగా దోమకొండకు చెందిన ఒక టీచర్‌కు ఎలాంటి వైకల్యం లేకున్నా సదరం సర్టిఫికెట్ సమర్పించినట్లు తెలిసింది. బాన్సువాడకు చెందిన మరో టీచరూ ఇలాగే చేశారు. మాచారెడ్డిలో ఒకరికి చెవులు సరిగానే పనిచేస్తున్నా.. మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాడు. మరో ఉపాధ్యాయుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రం జత చేశారని సమాచారం.

పట్టించుకోని ఉన్నతాధికారులు

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేపట్టడంతో తాము నష్టపోవాల్సి వస్తోందని అర్హులైన ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు అయినా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నకిలీ మెడికల్ సర్టిఫికెట్‌లు, పరపతి, రికమండేషన్‌లు, యూనియన్ లీడర్ల పెత్తనాలపై జిల్లా అధికారులు స్పందించాలని ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు. ఈ విషయమై వివరణ కోసం డీఈవోను ఫోన్ ద్వారా సంప్రదించడానికి 'సాక్షి' ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

నేతల కనుసన్నల్లో..

బదిలీలు, పదోన్నతుల వ్యవహారంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు చక్రం తిప్పుతున్నారు. ప్రధాన సంఘంతో పాటు మరో మూడు సంఘాల నేతలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఓ యూనియన్ నేత రోజంతా డీఈవో వెంటే, కార్యాలయంలోనే ఉండి వ్యవహారం నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. డీఈవో కార్యాలయం సిబ్బందికి, అధికారులకు తానే భోజనాలతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిసింది. బదిలీల వ్యవహారంలో డీఈవో కంటే సదరు ఉపాధ్యాయ సంఘం నేత పెత్తనమే సాగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. అనుకున్న స్థానాలకు బదిలీలు, ప్రమోషన్లు, నకిలీ మెడికల్ సర్టిఫికెట్లను చూసీచూడనట్లు వదిలేయడం వంటి అంశాలలో భారీగానే డబ్బులు చేతులు మారుతున్నట్లు సమాచారం. కాగా బదిలీలు, పదోన్నతుల్లో నిబంధనలు పాటించాలంటూ డీఈవోకు వినతిపత్రం ఇచ్చిన యూనియన్ నేతలే.. అక్రమాలను ముందుండి నడిపిస్తున్నారని తెలుస్తోంది.

బెంగళూరుకు సూపర్ లగ్జరీ బస్సు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లాకేంద్రం నుంచి బెంగళూరుకు వెళ్లడానికి సూపర్ లగ్జరీ బస్సును ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఉషాదేవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజామాబాద్–1 డిపోకు చెందిన ఈ సర్వీసు ప్రతిరోజు ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంటకు నిజామాబాద్‌నుంచి బయలుదేరే బస్సు మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. నిజామాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లడానికి పెద్దలకు రూ. 1,320, పిల్లలకు రూ. 750 టికెట్టు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందస్తుగా సీట్లు రిజర్వేషన్ చేసుకోవడానికి www.tsrtconline.inని సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి 2లక్షల 67వేల 847 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

- హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

నందిపేట్: హిందూ ధర్మాన్ని కాపాడేందుకు భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి సూచించారు. నందిపేటలోని కేదారీశ్వర ఆశ్రమంలో జరుగుతున్న అఖిలాంధ్ర సాధు పరిషత్ సమ్మేళనంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హంపీ పీఠాధిపతి ప్రసంగిస్తూ హిందూ ధర్మం గొప్పతనాన్ని వివరించారు. యువత పాశ్చాత్య నాగరికతను వీడి దేశ సంస్కృతిని కాపాడాలన్నారు.

కొనసాగుతున్న మహాసభలు

నందిపేటలోని కేదారీశ్వర ఆశ్రమంలో అఖిలాంధ్ర సాధు పరిషత్ మహాసభలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సుప్రభాతం, భగవద్గీత పారాయణం, సాధువులతో ప్రత్యేక పూజలు, హోమాలు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సాధువులు ప్రవచనాలు చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అయోధ్య నుంచి విచ్చేసిన 12 మంది సాధువులకు ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.



పూజలు చేస్తున్న విద్యారణ్య భారతి స్వామి

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడాలి

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడడం, ధార్మిక కార్యక్రమాలు చేపట్టడం, ఆధ్యాత్మిక సంస్కృతిని ప్రజలకు చేరవేయడమే మహాసభల ముఖ్య ఉద్దేశమని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాతా పరావిద్యానందగిరి స్వామి పేర్కొన్నారు. సనాతనంగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని, మన వేద విజ్ఞానం ఎంతో పురాతనమైందన్నారు. హిందూ సంప్రదాయాల్లో సైన్సు దాగి ఉందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ స్వామి రామ్ రాజేశ్వర ఆచార్యా మాట్లాడుతూ యువత ఈశ్వరుని ఉపాసన చేయాలని సూచించారు. ఎవరైతే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారో వారే హిందూ ధర్మ రక్షకులవుతారన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీదే గెలుపు'



మాట్లాడుతున్న బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కంచర్లలో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రాజ్యం నడుస్తోందన్నారు. బీఆర్‌ఎస్‌ను భూస్థాపితం చేసేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజల పక్షాన నిలిచే పార్టీ బీజేపీ అన్నారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ పేరిట బీఆర్‌ఎస్ నేతలు చేసిన కుట్రలను ఛేదించేందుకు బీజేపీ రైతుల పక్షాన నిలబడి పోరాడిందన్నారు. అలాగే మహిళా సంఘాలకు రావాల్సిన పావలా వడ్డీ కోసం ఉద్యమిస్తామన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులను కోరారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, నేతలు శ్రీధర్, శంకర్, రమేశ్, నర్సింలు, నర్సారెడ్డి, గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి 'మహిళా పోరు'

కామారెడ్డి టౌన్: మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, అభయహస్తం నిధుల విడుదల కోసం సోమవారం నుంచి 'మరోమారు మహిళా పోరు' పేరుతో ఉద్యమించనున్నట్లు బీజేపీ నేత వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు రాజంపేటలో, ఉదయం 11.30 గంటలకు భిక్కనూరులో ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 31వ తేదీన దోమకొండ, బీబీపేటలలో, ఫిబ్రవరి 1న మాచారెడ్డిలో, 4న జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో వంటావార్పు, 5న కామారెడ్డి ఇందిరా చౌక్‌లో నిరసన, 6న కొత్తబస్టాండ్ వద్ద బతుకమ్మ ఆటలతో నిరసన, 7న బోనాల ప్రదర్శన, 8న నల్లబ్యాడ్జీలతో మౌన ప్రదర్శన, 9న ప్రభుత్వ శవయాత్రలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

క్రమబద్ధీకరణ కలేనా..?

- 300 మంది సెకండ్ ఏఎన్‌ఎంల ఎదురుచూపు
- వయసు మీద పడుతోందని ఆందోళన
- జీవో నెం.18లో చేర్చి రెగ్యులరైజ్ చేయాలని వేడుకోలు



క్రమబద్ధీకరణ చేపట్టాలంటూ ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు (ఫైల్)

నస్రుల్లాబాద్: ప్రభుత్వం తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తుందని వేయి కళ్లతో ఎదురుచూస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంల ఆశలు అడియాశలే అవుతున్నాయి. దాదాపు 15 ఏళ్ల నుంచి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారిని పర్మినెంట్ చేయకపోవడం.. వయస్సు పైబడుతుండడంతో ఉద్యోగుల్లో తీవ్రమైన ఆందోళన నెలకొంది. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు లేకపోవడంతో అటు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. తమ జీ(వి)తాలు ఇప్పటికయినా మారాలని జిల్లావ్యాప్తంగా సెకండ్ ఏఎన్‌ఎంలు కోరుతున్నారు.

జిల్లావ్యాప్తంగా..

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 529 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 189 సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో 293 మంది సెకండ్ ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. వీరు 2007–2010 మధ్యలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో భాగంగా చేరారు. అయితే చేరిన నాటి నుంచి ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా తమ రాతమాత్రం మారడం లేదని వాపోతున్నారు. కొందరి వయస్సు నాలుగు పదులు దాటుతున్నా మారుమూల ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా 2500 మందికి ఒక ఏఎన్‌ఎం ఉండాల్సి ఉండగా కొంత మందికి ఏడెనిమిది వేళ జనాభా గ్రామాల్లో కూడా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతే కాకుండా ఒక్కొక్కరికి 8–10 గ్రామాలు కూడా ఉన్నాయి. వీరికి వచ్చే జీతంలోనే ఇతర గ్రామాలకు గంటల కొద్ది ఎండనక, వాననక ఆటోల కోసం ఎదురుచూస్తూ మరీ వెళ్లాల్సి వస్తోంది.

పనులన్నీ వీళ్లతోనే..

ఆరోగ్య కార్యకర్తలుగా పిలిచే సెకండ్ ఏఎన్‌ఎంలు ప్రభుత్వం పురమాయించే పనులకు దగ్గరగా ప్రభుత్వ ఉద్యోగులకు అందించే ఫలాలకు దూరంగా ఉన్నారనే చెప్పుకోవాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను రెగ్యులర్ వారితో సమానంగా వీరికి ఉంటాయి కాని గర్భిణులకు మెటర్నిటీ సెలవులు, హెల్త్‌కార్డులు, ట్రావెలింగ్ అలవెన్స్, యూనిఫాం అలవెన్సులు మాత్రం అందవు. ఇలా పూర్తి సమయం ఉద్యోగం చేస్తున్నా కూడా తమను రెగ్యులరైజ్ చేయడం లేదని సెకండ్ ఏఎన్ ఎంలు వాపోతున్నారు.



కంటి వెలుగులో సెకండ్ ఏఎన్‌ఎంలు

పనికి తగ్గ వేతనమేది?

ఆరోగ్య శాఖలో కీలకంగా విధులు నిర్వహించే బాధ్యత సెకండ్ ఏఎన్‌ఎంలదే అవుతుంది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి యోగక్షేమాలను చూసుకోవాలి. అంతటి కరోనాలో కూడా విధులు నిర్వహించిన వారిపై ప్రభుత్వం శీతకన్ను వేసిందని వాపోతున్నారు. ఒకవైపు ఎన్‌సీడీ పరీక్షలు, సర్వేలు, కంటి వెలుగు తదితర విధులన్నీ రెగ్యులర్ వారితో సమానంగా ఉన్నా జీతం ఇవ్వడంలో మాత్రం వ్యత్యాసం చూపుతున్నారు.

16 ఏళ్లుగా విధుల్లో ఉన్నాను



18 ఏళ్లుగా విధుల్లో ఉన్నాను. ప్రభుత్వ ఉద్యోగం అని చేరాను. కానీ ఇప్పటికీ రెగ్యులర్ కాలేదు. దాదాపు 7 వేల మందికి వైద్య ఆరోగ్య సేవలను అందిస్తున్నాను. మా సమస్యలు పరిష్కారమయ్యేలా ఉన్నతాధికారులు స్పందించాలి.

– నాగరమణి, సెకండ్ ఏఎన్ఎం, కమ్మాపూర్ సబ్ సెంటర్ బీర్కూర్

జీవోను అమలు చేయాలి



జీవో నెం. 18ను సెకండ్ ఏఎన్‌ఎంలకు అమలు చేయాలి. దీని ప్రకారం మా సేవలను గుర్తించి రెగ్యులర్ చేయాలి. సమానపనికి సమాన వేతనం అందించాలని ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని జీతాలు పెంచాలని కోరుతున్నాం. – శిరీష, సెకండ్ ఏఎన్ఎం మిర్జాపూర్

సమస్యలపై పోరాటం చేస్తాం

- బీడీ కార్మికుల జీవితాలను ఆగం చేస్తున్న ప్రభుత్వాలు
- రాష్ట్రంలో 7 లక్షల మందికి ఉపాధి కరువు
- 28 శాతం జీఎస్టీతో నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ పరిశ్రమను, కార్మికులను ఆగం చేశాయని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీడీ కార్మికులు, టేకేదార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణలో 7 లక్షల బీడీ కార్మికులు, 14 బీడీ పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారని, కార్మికులతో పాటు వారి కుటుంబాలు ఆగం చేశారన్నారు. మోదీ ప్రభుత్వం బీడీపై 28 శాతం జీఎస్టీ పెట్టి సగం బీడీ వ్యవస్థను నాశనం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో తీర్మానం చేసి బీడీ రోలింగ్ వ్యవస్థను రద్దు చేసే కుట్ర చేస్తే కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలను ఏకం చేసి బీడీ వ్యవస్థను రద్దు కాకుండా ఆపగలిగామని తెలిపారు. ఒక రాష్ట్రంలోని బీడీ పరిశ్రమ నుంచి ఏటా రూ.100 కోట్లు సెస్ రూపంలో కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తుందని కానీ కార్మికులు కష్టాల్లో ఉంటే ఆదుకునేందుకు ఎలాంటి పథకాలు లేవన్నారు. బీడీ కార్మికులకు ఈ జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి కూడా లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మొట్టమొదటిగా వారికి ఈఎస్ఐ ఆస్పత్రి సౌకర్యం కామారెడ్డి జిల్లాలో కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద బీడీ కార్మికులందరికీ పక్కా గృహాలు కట్టించాలని, వారి ఆరోగ్య సంక్షేమం కోసం ప్రతి మండలం వారిగా ఈఎస్ఐ ఆస్పత్రులను కట్టించాలని, కార్మికులకు బతుకులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. భారత్ జోడోయాత్రలో బీడీ కార్మికుల సమస్యలను విని రాహుల్ చలించిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, పండ్ల రాజు, అన్వర్ అహ్మద్, గుడుగుల శ్రీనివాస్, పాక రవి ప్రసాద్, సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బధిర ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం



సుభాష్‌నగర్: నగరంలోని టీఎన్‌జీవో భవన్‌లో బధిర (డెఫ్) ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా రవికాంత్‌రెడ్డి (సీనియర్ అకౌంటెంట్), అసోసియేట్ అధ్యక్షుడిగా మదన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సీహెచ్ పోతయ్య, పి ప్రియాంక, ప్రధానకార్యదర్శిగా సీహెచ్ విజయ్‌కుమార్, కోశాధికారిగా శివకుమార్, సంయుక్త కార్యదర్శులుగా కేవీ భరత్, ఎం చైతన్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉదయ్‌కుమార్, ఈసీలుగా సి అంబ రాజు, ఎల్ దివ్యరాణి ఎన్నికయ్యారు.

మెడికల్, సేల్స్ రిప్రజెంటెటివ్ కార్యవర్గం..



సుభాష్‌నగర్: తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటెటివ్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అంతకుముందు సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ, దేశీయ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం విధానాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ రాజు, కార్యదర్శిగా వెంకటేశ్వర స్వామి, కోశాధికారిగా ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎంఏ కరీముల్లా, అమరజిత్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా మహేష్ కులకర్ణి, పవన్ కుమార్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళి, సీపీఎం కార్యదర్శి రమేష్‌బాబు, సీఐటీయూ కార్యదర్శి నూర్జహాన్ అభినందించారు.

శివస్వాములకు ముస్లిం యువకుడి అల్పాహారం



పిట్లం: పిట్లం గ్రామానికి చెందిన షేక్ అఫ్రోజ్ ఆదివారం రాత్రి రాజన్న ఆలయంలో శివ మాలధారణ స్వాములకు అల్పాహారాన్ని ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటారు. అనంతరం శివ స్వాములు అఫ్రోజ్‌ను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసదాలు అందజేశారు. రమేష్, బసంత్, సుధాకర్, రాకేష్, పండరి, గంగారం, శ్రావణ్ తదితరలు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాలిటెక్నిక్ కాలేజీ మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ హోరాహోరీగా సాగుతోంది. ఆదివారం టోర్నీని రెండు, మూడు, నాలుగో టౌన్ ఠాణాల ఎస్సైలు పూర్ణేశ్వర్, శ్రావణ్‌కుమార్, సందీప్ సందర్శించారు. వారు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే దేశ విదేశాల్లో గుర్తింపు లభిస్తుందన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ పల్లె మహేష్, కోచ్ పారస్, అంపైర్లు షారుఖ్, దుర్గాప్రసాద్, స్కోరర్ నయూమ్, గ్రౌండ్‌మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ

మొదటి మ్యాచ్ శ్రీగాయత్రి, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మధ్య పోటీ జరిగింది. శ్రీ గాయత్రి 10ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాలిటెక్నిక్ కళాశాల జట్టు 8.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసి విజయం సాధించింది.

గిరిరాజ్ కళాశాల భారీ విజయం

గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి డిగ్రీ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో గిరిరాజ్ కాలేజీ భారీ విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జీజీ కళాశాల 10 ఓవర్లలో 110 పరుగులు చేసింది. ఇందులో విశాల్ 58, రామకృష్ణ 28 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కామారెడ్డి డిగ్రీ కళాశాల 10ఓవర్లలో 52 పరుగులే చేసింది.

23 పరుగుల తేడాతో వీఆర్‌సీ గెలుపు

ఆర్‌కే డిగ్రీ కళాశాల, వీఆర్‌సీ మధ్య మూడో మ్యాచ్ జరిగింది. వీఆర్‌సీ 10ఓవర్ల లో 3 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేయగా ఆర్‌కే కళాశాల 6వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది.

8వికెట్ల తేడాతో గెలిచిన 'సాందీపని'

వాగ్దేవి డిగ్రీ కాలేజీ, సాందీపని కాలేజీ మధ్య జరిగిన పోటీలో సాందీపని జట్టు 8 వికెట్ల తేడాతో గెలిచింది. వాగ్దేవి కళాశాల 10 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 60 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సాందీపని జట్టు 9.2ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 61 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది.



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

SAKSHI / SAKSHI DIGITAL MEDIA GROUP



బ్యాటింగ్ చేస్తున్న రెండో టౌన్ ఎస్సై పూర్ణేశ్వర్

SPL SAKSHI PREMIER LEAGUE

SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY

Regional sponsor





బ్యాటింగ్ చేస్తున్న మూడో టౌన్ ఎస్సై శ్రావణ్‌కుమార్, నాలుగో టౌన్ ఎస్సై సందీప్

సంతోషంగా ఉంది



సాక్షి టోర్నీలో హాఫ్ సెంచరీ చేయాలనుకున్నా. గతంలో మ్యాచ్‌లు ఆడినప్పుడు 40లోపు పరుగులు చేశా. ఈ టోర్నమెంట్‌లో మొదటనే 50కిపైగా పరుగులు చేయడం సంతోషంగా ఉంది. ఇక ముందు కూడా ఇదే విధంగా ఆడుతాను. – విశాల్, జీజీ కళాశాల

కుల సంఘాల మధ్య భూ వివాదం





నిరసన తెలుపుతున్న గొల్ల, కుర్మ సంఘాల సభ్యులు, మున్నూరు కాపు సంఘం సభ్యులు

- భూమి తమదంటే తమదని నిరసన

బీబీపేట: ఇరవై ఏళ్ల క్రితం అమ్మిన భూమి ప్రస్తుతం తమదంటే తమదని రెండు కుల సంఘాల సభ్యులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన ఘటన ఆదివారం బీబీపేటలో చోటు చేసుకుంది. గ్రామ శివారులోని 446, 447 సర్వే నంబర్లలో 36 ఎకరాల భూమిని గంప గుత్తగా మున్నూరు కాపు సంఘం సభ్యులు గొల్ల, కుర్మ సంఘం సభ్యులకు 2003లో అమ్మారు. గొల్ల, కుర్మ సంఘం సభ్యులు ఆ భూమిని ప్రస్తుతం ఇతరులకు అమ్మేశారు. కాగా ఆ భూమిలో తమకు కొంత భాగం వస్తుందని ము న్నూరు కాపు సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం గొల్లకుర్మలకు చెందిన 8 గొర్రెలను మున్నూరు కాపు సంఘం సభ్యులు తీసుకెళ్లి కట్టేశారు. దీంతో ఆదివారం ఉదయం గొల్ల కుర్మ సంఘం సభ్యులు గొర్లను, మేకలను ప్రధాన చౌరస్తా వద్దకు తీసుకువచ్చి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అప్పట్లో తమకు అమ్మిన భూమిని ఇప్పుడు వారిది అంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మిన భూమిలో వారికి హక్కు లేదని తెలిపినా అక్రమంగా మా గొర్లను తీసుకెళ్లారని ఆరోపించారు. పోలీసులు అక్కడకు చేరుకొని వారిని సముదాయించి పంపించారు. ఈ విషయం తెలుసుకున్న మున్నూరు కాపు సభ్యులు మధ్యాహ్నం చౌరస్తాకు వచ్చి బైఠాయించారు. పొలంలో మేసినందుకే గొర్లను తీసుకువచ్చామని, అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని తమకు ఇంకా భూమి రావల్సి ఉందని పేర్కొన్నారు. అనంతరం పట్టుకున్న గొర్లను గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించారు.

హిందూ సంఘటనే శ్రీరామరక్ష

సుభాష్‌నగర్: హిందూ సమాజ సంఘటితమే దేశానికి శ్రీరామ రక్ష అని రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) ప్రాంత సహ సేవా ప్రముఖ్ వేంపల్లి ప్రతాప్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని కోటగల్లిలోని బాలికల పాఠశాలలో శివాజీ ప్రభాత్ శాఖ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపల్లి ప్రతాప్ మాట్లాడుతూ దేశ చరిత్ర, స్వాభిమానాన్ని హిందూ సమాజం మర్చిపోతోందని, మరోసారి గుర్తు చేయాలని సూచించారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేయడమే లక్ష్యంతో 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ ఏర్పడిందన్నారు. అంతకుముందు స్వయం సేవకులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నగర సంఘ్ చాలక్ శ్రీనివాస్, రామన్న, గంగనర్సయ్య, సుమిత్, వినయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కర్రసాము చేస్తున్న స్వయం సేవకులు

జిల్లా చరిత్రను పరిశోధించాలి

నిజామాబాద్‌సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా చరిత్రను పరిశోధించి అధ్యయనం చేసి లిఖించాలని అఖిల భారతీయ ఇతిహాస సంకలన సమితి జాతీయ ఉపాధ్యక్షుడు వి కిషన్‌రావు అన్నారు. ఆదివారం నిజామాబాద్ కపిల హోటల్ సమావేశం హాల్‌లో ఇందూరు ఇతిహాస సంకలన సమితి నిర్వహించిన చరిత్ర దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన చరిత్ర మన ప్రాముఖ్యతను నేటి తరానికి తెలియజేయాలని సూచించారు. సిద్ధ సాయారెడ్డి రచించిన బోధన్ చరిత్ర గ్రంథాన్ని గురు చరణం, బాల శ్రీనివాస మూర్తి, జిల్లా చరిత్రకారుడు కందకుర్తి యాదవరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. బోధన్ ప్రాంతానికి చాలా పురాతన చరిత్ర ఉందని ఆ చరిత్రను మరింత వెలికి తీయాలన్నారు. చరిత్రను పునర్ లిఖించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బాల శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ నిజాం కాలంలో 1940 నుంచి 1948 వరకు న్యాయవాదులు సమ్మె చేశారని చెప్పారు. అనంతరం వివిధ రంగాల్లో పీహెచ్‌డీ చేసిన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇతిహాస సంకలన సమితి బాధ్యులు కందకుర్తి ఆనంద్, చరిత్ర పరిశోధకులు కందకుర్తి యాదవరావు, గంట్యాల ప్రసాద్ పాల్గొన్నారు.



బోధన్ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇతిహాస సంకలన సమితి సభ్యులు

అతివలకు అభయం

- ఠాణాల్లో ఉమెన్ హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

ఖలీల్‌వాడి: ఆపదలో ఉన్న మహిళలకు మొదటి సంప్రదింపుల కేంద్రాలుగా, వన్ స్టాప్ సపోర్టు సెంటర్‌గా వ్యవహరించడానికి తెలంగాణ పోలీసులు మహిళ భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఉమెన్ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాలో 42, కామారెడ్డి జిల్లాలో 23 పోలీస్‌స్టేషన్‌లో వీటిని నెలకొల్పారు. ఇక్కడ మహిళలకు అత్యవసర సహాయాన్ని అందించడానికి, బాధితులకు ఉపశమనం కలిగించడటానికి సిబ్బంది శిక్షణ పొందారు.

ఆశ్రయించాల్సిన పరిస్థితులు

ఈవ్ టీజింగ్, బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు, అత్యాచారం, భర్త అత్తమామల క్రూరత్వం, గృహహింస, కార్యాలయల్లో వేధింపులు, బాల్యవివాహాలు, పిల్లలపై లైగింక వేధింపులు, అక్రమ రవాణా వంటి ఘటనలు జరిగినప్పుడు హెల్ప్ డెస్క్‌లను ఆశ్రయించవచ్చు. పోలీసు స్టేషన్లలో మరింత స్నేహపూరితంగా మహిళలకు చేరువయ్యేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేశారు.

సిబ్బంది విధివిధానాలు

ఆపదలో ఉన్న మహిళలకు సమగ్ర అత్యవసర సాయమందిస్తారు. వైద్య సహాయం(మహిళలు హింసకు గురైనప్పుడు), కౌన్సెలింగ్, ఆశ్రయం కల్పించడం, మానసిక ఆరోగ్యం, నైపుణాభివృద్ధి, జీవనోపాదిని పరిగణనలోకి తీసుకోవడం వంటి కార్యక్రమాలు చేపడుతారు. మహిళలను అక్రమ రవాణా నుంచి రక్షించడం, నిరోధించడం వంటివి చేస్తారు. జిల్లా ఏహెచ్‌టీయూ నిర్దేశించిన విధంగా ఇతర ఠాణాలతో కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటారు.

హెల్ప్ డెస్క్‌ల కూర్పు

ప్రతి హెల్ప్ డెస్క్‌కు ఇద్దరు మహిళా హెడ్‌కానిస్టేబుళ్లు ఉంటారు. సీనియర్ ఉమెన్ కానిస్టేబుల్‌తో పాటు మహిళ హెల్ప్ డెస్క్ ఆఫీసర్‌గా సబ్ ఇన్‌స్పెక్టర్ నియమితులయ్యారు. ఈ బృందం ఠాణా ఇన్‌చార్జి అధికారి పర్యవేక్షణలో పని చేస్తుంది.

భాగస్వామి సంస్థలు

హెల్ప్ డెస్క్ లక్ష్యాలు నెరవేర్చడానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, ఇతర వాటాదారులతో సమన్వయం చేసుకుంటారు. సాంఘిక సంక్షేమశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, కార్మికశాఖ, విద్యాశాఖ, జిల్లా న్యాయసేవలు, అధికారులు, ఎన్జీవోల సహకారంతో సేవలను విస్తృతంగా అందిస్తారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు(ఫైల్)

ఏం చేస్తారు?

ఫిర్యాదులు స్వీకరిస్తారు. రిజిస్టర్‌లో నమోదు చేసి అధికారికి పంపిస్తారు. సదరు అధికారి ఫిర్యాదును పరిశీలిస్తారు. సంబంధిత ఎస్‌హెచ్‌వోతో సంప్రదింపులు జరుపుతారు. ఫిర్యాదులోని వాస్తవాలను చర్చిస్తారు. తీసుకున్న చర్యల నివేదికను సంబంధిత సంబంధిత యూనిట్‌కు మెమోతో పంపిస్తారు. పిటిషన్‌పై మహిళా భద్రతా విభాగంలో అధికారులు చర్యలు తీసుకుంటారు. మాడ్యూల్‌ను సిబ్బంది అనుశీలన చేస్తారు. సంబంధిత యూనిట్ల నుంచి యాక్షన్ రిపోర్టులు సేకరిస్తారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తారు.

ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతాం

మహిళలు ఫిర్యాదులు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. పని చేసే దగ్గర మహిళల వేధింపులకు గురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. మహిళా హెల్ప్ డెస్క్‌ల ద్వారా వారికి కావాల్సిన సమాచారం అందిస్తాం.

– వెంకటేశ్వర్, ఏసీపీ, నిజామాబాద్

బీజేపీతోనే సుపరిపాలన



మద్నూర్: బీజేపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమవుతుందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. మండలంలోని సోనాల గ్రామంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆమె టీవీలో వీక్షించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ధనుంజయ్‌పటేల్ ప్రసంజీత్‌కాలే, వెంకట్ కాలే, యాదవ్‌రావు, హన్మండ్లు, వీరేశం ఉన్నారు.

'కార్పొరేటర్ రోహిత్ అరెస్టు అక్రమం'

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ కార్పొరేషన్‌లో సమస్యలను మంత్రి కేటీఆర్‌కు తెలిపేందుకు వెళ్లిన కాంగ్రెస్ కార్పొరేటర్ గడుగు రోహిత్‌ను అరెస్టు చేయటాన్ని ఖండిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్‌కు కార్పొరేటర్ రోహిత్ మెమోరండం ఇవ్వడానికి వెళ్తే పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేశారన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్ హందాన్ మాట్లాడుతూ పట్టణ సమస్యలపై మంత్రికి మెమోరండం ఇవ్వడానికి వెళ్తున్న రోహిత్‌ను అరెస్టు చేయడం ఇంటి చుట్టూ పోలీసులను పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం సరి కాదన్నారు. టీఆర్ఎస్ నాయకుల మెప్పు కోసం పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని గడుగు గంగాధర్ ఆరోపించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, జావిద్ అక్రమ్, రాజ నరేంద్రగౌడ్, మహేష్, గంగారెడ్డి, సుభాష్ జాదవ్, సాయిలు, కైసర్, నిఖిల్ రెడ్డి, చింటూ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



బీబీపేట: బీబీపేట బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

అ'పూర్వ' సమ్మేళనం



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని మాణిక్‌భవన్ స్కూల్‌లో 1989 – 90లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి సరదగా గడిపారు. తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సత్యనారాయణరావు, అట్లూరి మురళి కృష్ణ, నంగునూరు ప్రకాశం, కృష్ణారావు, కాంతయ్య, సాయిలు, సురేందర్, వివేకానంద్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో శనివారం రాత్రి తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. బాధితుడు గోపారం దేవజీ పెర్కిట్‌లోని మున్నూర్ కాపు సంఘంలో భజన కార్యక్రమానికి రాత్రి 8గంటలకు కుటుంబ సభ్యులతో వెళ్లాడు. తిరిగి రాత్రి 12గంటలకు ఇంటికి వచ్చే సరికి దొంగలు తాళం ధ్వంసం చేసి లోనికి చొరబడి రూ.2లక్షల 20వేలు, 10 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్గొండలో గంజాయి స్వాధీనం



రాజంపేట: మండలంలోని ఆర్గొండ గ్రామానికి చెందిన జంగం భూమయ్య ఇంట్లో ఆదివారం పోలీసులు గంజాయి పట్టుకున్నారు. ఎస్సై రాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా 280 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయిని స్వాధీనం చేసుకొని భూమయ్యను అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో





క్షతగాత్రులు

లింగంపేట: మండలంలోని మెంగారం గ్రామ శివారులో ఆదివారం ఆటో అదుపు తప్పి బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. బోనాల్ గ్రామం నుంచి ఆటో లింగంపేటకు ప్రయాణికులను తీసుకొని వస్తుంది. ఈ క్రమంలో మెంగారం గ్రామం దాటిన తర్వాత అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడిపోయింది. ఆటోలో ప్రాయాణిస్తున్న వడ్ల విఠల్(బోనాల్), తట్టి బాలమణి(ముంబోజిపేట), గరిగ సత్తవ్వ(బోనాల్), మంతపురి భూమయ్య(మెంగారం), పాపవ్వ(మెంగారం) గాయపడ్డారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్సై తెలిపారు.

బ్రిడ్జి విషయంలో ఇరు గ్రామాల మధ్య ఘర్షణ

ఇందల్‌వాయి: మండలంలోని మల్లాపూర్, లోలం గ్రామాల మధ్య వాగుపై నిర్మించిన వంతెన ప్రారంభం విషయంలో ఆదివారం ఇరు గ్రామాల ప్రజల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. వాగుపై రూ. నాలుగున్నర కోట్లతో వంతెనను నిర్మించారు. వంతెనను ఆర్టీసీ చైర్మన్ చేతుల మీదుగా ప్రారంభించడానికి లోలం గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు. అయితే తమ గ్రామం వైపు శిలాఫలకం పెట్టి సర్పంచ్ పేరు పెట్టలేదని మల్లాపూర్ గ్రామస్తులు వంతెన ప్రారంభించడానికి వచ్చిన ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఎదుటే ఆందోళన చేపట్టారు. అది మా గ్రామ వంతెన అని లోలం గ్రామస్తులు వాదనకు దిగారు. వివాదం చెలరేగడంతో ఎమ్మెల్యే వంతెనను ప్రారంభించకుండా లోలం గ్రామానికి వెళ్లారు. అక్కడ మల్లయ్య ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ఆలయం వద్ద వేచి ఉన్నారు. కానీ వంతెన ప్రారంభించనివ్వలేదని లోలం గ్రామస్తులు బ్రిడ్జి వద్దనే బైఠాయించారు. ఈ క్రమంలో మల్లాపూర్, లోలం గ్రామస్తుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరు గ్రామాల ప్రజలు పరస్పరం కర్రలతో దాడులు చేసుకున్నారు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకుని ఇరు గ్రామాల ప్రజలు చెదరగొట్టారు. లోలం గ్రామస్తులు ఎంతకు గ్రామంలోకి రాకపోవడంతో అభివృద్ధి పనులను ప్రారంభించకుండానే ఎమ్మెల్యే తిరిగి వెళ్లిపోయారు.

మూడ్రోజుల్లో కూతురి పెళ్లి

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

తాడ్వాయి: మూడు రోజుల్లో కూతురి పెళ్లి ఉండగా రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణించాడు. వివాహ వేడుకతో కళకళలాడాల్సిన ఆ ఇంట్లో విషాదం నెలకొంది. వివరాలు.. మండలంలోని దేవాయిపల్లి గ్రామానికి చెందిన కాత్రాల మల్లయ్య(40)కు భార్య రజిత, కూతురు మానస, కుమారుడు మధు ఉన్నారు. కూతురు వివాహం దోమకొండకు చెందిన వ్యక్తితో నిశ్చయమైంది. ఫిబ్రవరి 1న పెళ్లి పెట్టుకున్నారు. ఆదివారం మల్లయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం తాడ్వాయికి వచ్చాడు. పనులు ముగించుకొని స్వగ్రామం వెళ్తుండగా కామారెడ్డి నుంచి తాడ్వాయి వస్తున్న డీసీఎం ఢీకొంది. మల్లయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా లైసెన్సులు, వాహన ధ్రువపత్రాలు, హెల్మెట్లు లేని వాహనదారులకు జరిమాన విధించారు. తనిఖీల్లో ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.